# లేస్, కురుకురేల్లో 25% సోడియం తగ్గింపు

- ఫ్రీటో లే యోచన
- తయారీకి రైస్‌బ్రాన్ నూనె వాడకం

హైదరాబాద్, న్యూస్‌టుడే: చిన్న పిల్లల ఆరోగ్యానికి మేలు చేసే విధంగా పెప్సీకో చర్యలు తీసుకుంటోంది. బంగాళాదుంప ముక్కలతో సహా అన్ని రకాల చిరుతిళ్లలో సోడియంను 25 శాతం తగ్గించనున్నట్లు ఫ్రీటో లే ఇండియా పరిశోధన, అభివృద్ధి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆహారం పానీయాలు) టి.ఎస్.ఆర్.మురళి తెలిపారు. పెప్సికో ఆహార విభాగం ఫ్రీటో-లే ఇండియా లేస్ చిప్స్, కురుకురే, అంకుల్ చిప్స్, లెహర్ పేర్లతో వివిధ రకాల చిరుతిళ్ల (సాల్టెడ్ స్నాక్స్)ను విక్రయిస్తోంది. దేశీయ వినియోగదారులు ఎక్కువ ఉప్పు తినేందుకు ఇష్టపడతారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సోడియంను తగ్గించనున్నట్లు మురళి చెప్పారు. కొవ్వు పదార్థాల (శాచురేటెడ్ ఫ్యాట్స్)లను తగ్గించేందుకు రైస్ బ్రాన్ నూనెను వాడుతున్నాం. ఈ విధంగా 40 శాతం హాని కలిగించే కొవ్వు పదార్థాలను తగ్గించాం.



విపణిలోకి విడుదల చేసిన 'లేస్' కొత్త రుచులను అందించిన వారితో ఫ్రీటో లే ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రుచిరా జైట్లీ (ఎడమ), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆహారం, పానీయాల పరిశోధన) టి.ఎస్.ఆర్. మురళి (కుడి)

**నాలుగు రుచుల ఎంపిక:** కొత్త రుచుల పరిచయం కోసం కంపెనీ వినియోగదారుల నుంచి కొత్త రుచుల పేర్లు, వాటి నినాదాలను కోరింది. 13 లక్షల మంది పంపిన రుచుల నుంచి నాలుగు రుచులను- ఛీస్ మెక్సికానా, ట్యాంజీ ట్విస్ట్ మస్తానా మ్యాంగో, హిప్ హాప్ హనీ / అండ్ చిల్లీ-ఎంపిక చేసింది. వీటిని హైదరాబాద్‌లో విపణిలోకి ప్రవేశపెట్టింది. వీటిలో ఏ రుచిని వినియోగదారులు ఎక్కువ ఆదరిస్తారో దాన్ని మాత్రమే కొనసాగించి మిగిలిన వాటిని ఉపసంహరిస్తామని ఫ్రీటో లే ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రుచిరా జైట్లీ తెలిపారు. ఎంపికైన నాలుగు రుచులను అందించిన వారికి ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు చెల్లించింది. ఈ నాలిగింటిలో ఎంపికై మార్కెట్‌లో కొనసాగే రుచిని రూపొందించిన వారికి రూ.50 లక్షలతోపాటు ఆ రుచి చిప్ విక్రయాల్లో ఒక శాతం చెల్లిస్తారు.

**ఒప్పంద సాగుపై మరింత దృష్టి:** బంగాళాదుంపలను సమకూర్చుకోవడానికి ఫ్రీటో-లే ఒప్పంద సాగుపై మరింత దృష్టి సారించనుంది. ప్రస్తుతం తమిళనాడు, పంజాబ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కంపెనీ వీటిని సమకూర్చుకుంటోంది. 40 వేల రైతుల నుంచి బంగాళాదుంపలను కంపెనీ కొనుగోలు చేస్తోంది. మరో 15 వేల మంది రైతులు ఒప్పందం వ్యవసాయం ద్వారా కంపెనీకి ముడి సరుకును అందిస్తున్నారు. మూడేళ్లలో ఒప్పంద సాగు రైతులను 60 వేల వరకు పెంచుకోవాలని భావిస్తున్నామని జైట్లీ అన్నారు. చిరుతిళ్ల విపణిలో కంపెనీ వాటాను మాత్రం వెల్లడించలేదు.